

పంటపొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి తదితరులు



ప్రతి రైతును ఆదుకుంటాం

● పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కమలాపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డితో కలిసి కమలాపురం మండలంలోని చదిపిరాళ్ల, గొల్లపల్లె గ్రామాల పరిధిలోని పంట పొలాలను కలెక్టర్ పరిశీలించారు. అక్కడే మండలంలో పశుసంపద వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏర్పాటు చేసుకున్న గొర్రెలు, మేకలు, కోళ్లషెడ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు సెంటీమీటర్ల కన్నా తక్కువ వర్షపాతం నమోదయిందన్నారు. కొన్ని ప్రాంతాల్లోనే అత్యధిక వర్షం వల్ల వరి నేలకు ఒరిగిందన్నారు. అయితే నష్టం చాలా తక్కువ స్థాయిలో జరిగిందన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామన్నారు. అనంతరం కోళ్ల, పొట్టేళ్లను పెంచుకున్న రైతులతో మాట్లాడారు. వాటి అభివృద్ధికి కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కమలాపురం నియోజకవర్గంలో వర్షాభావం ఏర్పడిందన్నారు. అనుకున్న స్థాయిలో వర్షాలు పడడంలేదని అన్నారు. పంటనష్టం జరిగితే అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తారని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ఇర్విన్, స్థానిక తహశీల్దారు శివరామిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, వ్యవసాయ పశుసంవర్ధకశాఖ అధికారి ఏడీప నరసింహారెడ్డి, ఎంపీడీవో జ్యోతి, మండల వ్యవసాయాధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వర్రా కస్టడీపై విచారణ 5కు వాయిదా

కడప రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌పై విచారణను ఎస్సీ, ఎస్టీ కోర్టు(నాల్గవ అదనపు జిల్లా కోర్టు) 5వ తేదీ గురువారానికి వాయిదా వేసింది. వర్రా తరుపు న్యాయవాదులు పోలీస్ కస్టడీకి అవసరంలేదని గత శుక్రవారం విన్నవించిన మేరకు తగిన ఆధారాలను అందజేయాలని న్యాయస్థానం పేర్కొంది. ఇందుకు సోమవారం వరకు కోర్టు గడువు ఇచ్చింది. ఆ సమయం సరిపోలేదని మరింత గడువు ఇవ్వాలని న్యాయస్థానాన్ని వర్రా తరుపు న్యాయవాదులు విన్నవించగా గురువారానికి వాయిదా పడింది.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 110 ఫిర్యాదులు

కడప క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు అందాయి. ఆయన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరపాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 110 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి సంబంధిత పోలీసుస్టేషన్‌లకు బదిలీ చేశారు.

రౌడీషీటర్ హత్య

● లాడ్జీలో మద్యం మత్తులో హత్య జరిగినట్లు అనుమానం



కొప్పుల రాఘవేంద్ర అలియాస్ పప్పీ (ఫైల్)

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని సుందరాచార్యుల వీధిలో గల ఓ లాడ్జీలో రౌడీషీటర్ కొప్పుల రాఘవేంద్ర అలియాస్ పప్పీ (30) ఆదివారం రాత్రి హత్యకు గురయ్యాడు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు..

ఎనమల లోకేశ్‌రెడ్డి అనే వ్యక్తి పేరుతో నవంబరు 30 తేదీ శనివారం లాడ్జీలో రూమ్ బుక్ చేశారు. ఆదివారం రాత్రి లోకేశ్‌రెడ్డి తోపాటు పప్పీ మరికొందరు లాడ్జీ గదిలో మద్యం సేవించి గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారిన తరువాత గదిని శుభ్రం చేయడానికి బాయ్ వెళ్లినప్పుడు రక్తపు మడుగులో ఉన్న యువకుడిని చూసి లాడ్జీ యాజమాన్యానికి సమాచారం ఇచ్చాడు. యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ భక్తవత్సలం, వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించేందుకు యత్నించారు. మృతుడిపై మద్యం సీసాలతో దాడి చేసినట్లు గాయాలను బట్టి అనుమానం వ్యక్తం చేశారు. లాడ్జీ మేనేజర్ చంద్ర ఓబులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పప్పీకి ఆరునెలల క్రితమే వివాహమైందని పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాల ఆధారంగా..

హత్యకు గురైన యువకుడు సంజీవనగర్‌కు చెందిన కొప్పుల రాఘవేంద్ర అలియాస్ పప్పీగా గుర్తించారు. ఇతడిపై ప్రొద్దుటూరులోని పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాని టూటౌన్ పోలీసు స్టేషన్లో అతనిపై రౌడీ షీట్ ఉందని పోలీసులు తెలిపారు. అప్పట్లో పోలీసులు అతన్ని నగర బహిష్కరణ చేశారు. దీంతో ఐదేళ్లుగా అతను ఎక్కడా దౌర్జన్యకర సంఘటనల్లో పాల్గొన్నట్లు రికార్డులేదు. దౌర్జన్యాలకు దూరంగా ఉన్న పప్పీని ఎందుకు ఎవరు హత్య చేశారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా ఎనమల లోకేశ్‌రెడ్డితో పాటు రెడ్డివారి వీధికి చెందిన అనిల్ కుమార్‌రెడ్డి లాడ్జీలోని గదిలో ఉన్నట్లు గుర్తించారు. వీరితో పాటు ఇస్లాంపురం వీధికి చెందిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త ముజీబ్ కూడా ఉన్నట్లు సమాచారం. రాత్రి ముజీబ్ లాడ్జీలో లోకేశ్‌రెడ్డి పప్పీలతో కలిసి మద్యం సేవించినట్లు గుర్తించారు. ముజీబ్‌ను ప్రస్తుతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పప్పీ హత్య పథకం ప్రకారం జరిగిందా లేదా మద్యం మత్తులో మాటా మాటా పెరిగి జరిగిందా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఎనమల లోకేశ్‌రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డిలు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.



లాడ్జీ గదిలో పప్పీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామక్రిష్ణారెడ్డి



వైసీపీ అధినేత జగన్ పాలన అదో భ్రమయుగం. తన పాలనలో బడిపిల్లలకు ఇచ్చే చిక్కీల మొదలు.. రైతుల సొంత ఆస్తులకు ఇచ్చే పాసుబుక్కుల దాకా.. అన్నింటిపైనా జగన్‌బొమ్మ ఉండాల్సిందే. ఆఖరుకు పొలాల్లోనే కాదు బంజరుభూముల్లోనూ సర్వేరాళ్లపై జగన్‌బొమ్మలు, పేర్లూ.. అంతటితో ఆయన ప్రచారపిచ్చి ఆగలేదు.. పేదలకు ఇళ్లు కాదు.. ఏకంగా ఊర్లే నిర్మిస్తున్నాం అని ఆర్భాటంగా ప్రకటించారు. వాటికి జగనన్న లేఅవుట్లు పేరు పెట్టారు. సెంటు, సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించారు. అవీ ఎక్కడో ఊర్లకు దూరంగా కొండల్లో గుట్టల్లో. లక్షల ఇళ్లు కడుతున్నాం అని ప్రచారం చేసుకున్నారు. అయితే ఆ లేఅవుట్లలో కరెంటు లేదు. నీళ్లు లేవు. రోడ్లూ లేవు. నిర్మాణమెలా చేస్తారు? దీంతో లక్ష్యంలో 30శాతం కూడా పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం మిగిలిన ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశిస్తోంది. నిర్మాణం పూర్తికాకుంటే వీరికి మరో ఇల్లు మంజూరు కాదంటోంది. దీంతో నిరుపేద లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

జగన్ ప్రచారం.. పేదలకు శాపం..!

● వైసీపీ హయాంలో పేరుకోసం గృహాలు కేటాయింపు ● ఊరి బయట లేఅవుట్లు
● నీళ్లు, రోడ్లు కరువు ● నిర్మాణాలు మొదలుపెట్టని లబ్ధిదారులు
● కట్టుకోకపోతే బిల్డింగు రద్దు



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జిల్లాలో 436 జగనన్న లేఅవుట్లు వేశారు. లక్షా 10వేల ఇళ్ల కేటాయిస్తే 89వేల ఇళ్ల రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన డబ్బు సరిపోకపోవడం, లేఅవుట్లలో వసతులు లేని కారణంగా ఇళ్ల నిర్మాణమే ముందుకు సాగడం లేదు. అప్పుడు జగన్ చేసిన తప్పిదం కారణంగా ఇప్పుడు లబ్ధిదారుడు ఇల్లు కట్టుకోకపోతే భవిష్యత్తులో ఇల్లు రాని పరిస్థితి ఏర్పడింది.

వైసీపీ హయాంలో జిల్లాలో జగనన్న లేఅవుట్‌లు వేసి పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చారు. 89వేల ఇళ్లస్థలాల రిజిస్టరు మ్యాపింగ్ జరిగింది. ఏదైనా లేఅవుట్ వేస్తే నిర్మాణానికి అవసరమైన వసతులన్నీ కల్పించాల్సి ఉంది. అంటే రోడ్లు, విద్యుత్, ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన నీటి వసతి కల్పించాల్సి ఉంది. అయితే జగన్ హయాంలో వేసి లేఅవుట్లలో చాలాచోట్ల కనీస వసతులు కల్పించలేదు. ఇంటికి ఇచ్చే ఆర్థికసాయం రూ.1.80లక్షలు కూడా కేంద్ర ప్రభుత్వానిదే. అప్పటి వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. అయితే మొత్తం వాళ్లే ఇచ్చినట్లు బిల్డప్ ఇచ్చారు.



అప్పులు చేసి నిర్మాణం..

జిల్లాకు మంజూరైన 89వేల ఇళ్లల్లో 31 వేల ఇళ్లు పూర్తయ్యాయి. అది కూడా సొంతంగా స్థలం ఉన్న వారికి మంజూరైన ఇళ్లు మాత్రమే కట్టుకున్నారు. మిగతా 60వేల ఇళ్లు వివిధ దశల నిర్మాణంలో ఉన్నాయి. టీడీపీ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షల పైబడి ఉండేది. జగన్ సర్కారు దాన్ని రూ.1.80లక్షలకు కుదించింది. ఎక్కడో ఊరిబయట లేఅవుట్లు వేసింది. సొంతంగా స్థలం ఉన్న వారు మాత్రమే ఆ డబ్బులు సరిపోకపోయినా అప్పులు చేసి కట్టుకున్నారు. అయితే లేఅవుట్లలో ఉన్న మిగతా ఇళ్ల నిర్మాణం ముందుకు పడడంలేదు. ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారులకు కాంట్రాక్టర్లు కట్టిస్తున్నారు. ఇవి కూడా నత్తనడకన సాగుతున్నాయి.

సమస్యలతో సతమతం

ఎక్కడో ఊరిబయట విసిరేసినట్టున్న లేఅవుట్లలో కనీస వసతులైన రోడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. హడావుడిగా లేఅవుట్‌లు వేశారు. ఇల్లు కట్టుకోవాలంటే నీరు అవసరం. ఇక ఆ ప్రాంతానికి నిర్మాణ సామగ్రి తీసుకు వెళ్లాలంటే రోడ్లు అవసరం. కరెంటు అవసరం. అయితే నిర్మాణానికి కీలకమైన విద్యుత్, నీళ్లు, రోడ్లను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏదో ఆదరబాదరగా ఉపాధి నిధులతో లేవుట్లలో రోడ్లు, నీటి సౌకర్యాల పనులు చేపట్టారు. ఆ పనులు చేసిన వారికి కూడా అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. చాలాచోట్ల లేఅవుట్‌లలో ఏర్పాటు చేసిన ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం, రోడ్లు లేని కారణంగా ఇళ్ల నిర్మాణానికి అడుగులు పడడంలేదు. అధికార యంత్రాంగం ఎంత ఒత్తిడి తెచ్చినా కూడా "ఇల్లు కట్టుకోవాలంటే నీళ్లుకావాల కదా సార్.. ఇటుక, సిమెంటు ఇతరాలు తీసుకెళ్లాలంటే రోడ్లు లేవు. ఎలా కట్టుకోవాల సార్" అంటూ లబ్ధిదారులు చెబుతుండడం చూసి గృహనిర్మాణశాఖ అధికారులు అవాక్కవుతున్నారు.

> **ప్రతి ఒక్కరూ ఇంటిని పూర్తి చేసుకోండి..**
>
> పక్కాగృహాలు పొందిన లబ్ధిదారులందరూ వచ్చే ఏడాది మార్చి 31లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. ఇప్పుడు ఇల్లు మంజూరైన వారు గడువులోపు పూర్తి చేసుకోకపోతే భవిష్యత్తులో వారికి మళ్లీ ఇల్లు మంజూరు కాదు. సమాచారమంతా కేంద్ర గృహ నిర్మాణశాఖ వద్ద ఉంటుంది. కనుక ఇప్పుడే ఇల్లు కట్టుకోండి. డ్వాక్రాల ద్వారా సహాయాన్ని కూడా అందిస్తాం.
>
> - రాజారత్నం, గృహ నిర్మాణశాఖ పీడీ

4,500 ఇళ్లు టార్గెట్

నీటి సమస్యకు సంబంధించి సుమారు రూ.8కోట్ల మేర బిల్లులు పెండింగులో ఉన్నాయి. వచ్చే ఏప్రిల్ నుంచి కొత్త హౌసింగ్ స్కీం మొదలుకానుంది. మార్చిలోపు ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలన్నది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబరు 3 లేదా నాలుగో వారంలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాకు కూడా 4,500 టార్గెట్ ఇస్తే 2,500 పూర్తయ్యాయి. గడువులోపు టార్గెట్ పూర్తి చేసేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. అయితే లే అవుట్లలో వసతులు ఏర్పాటు చేయకుండా నిర్మాణాలు పూర్తి చేయని ఇళ్లను రద్దు చేస్తామంటే ఎలా అని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



ఈ ఫోటోలో కనిపిస్తున్నది చెన్నూరు మండలంలోని కనుపర్తి లేఅవుట్. ఇక్కడ మొత్తం 696ఇళ్లు మంజూరయ్యాయి. ఇక్కడ విద్యుత్ సౌకర్యం తప్ప ప్రధాన రోడ్లు లేవు, నీరు లేదు. అప్పట్లో అధికారులు ఇంటర్నల్ రోడ్ల కోసం రూ.5కోట్లు, డ్రైనేజీకి రూ.3కోట్లు, నీటి వసతి కోసం రూ.1.50కోట్లు మొత్తం రూ.8.50కోట్లతో అంచనా వేశారు. అయితే ఒక్కపైసా విడుదల కాలేదు. ఎలాంటి బోరు వసతీ లేదు. ఇక్కడ ఇళ్లు కట్టుకోవాలన్నా, కాలనీకి వెళ్లాలన్నా సాహసమే. ఇళ్లు కట్టకపోతే రద్దు చేస్తామంటే కొందరు భయపడి అప్పులు చేసి ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి 80ఇళ్లు మాత్రం పూర్తి చేసుకున్నారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. లబ్ధిదారులు తమ వాటాగా 491 మంది రూ.35వేలు చెల్లించారు. అయినా ఇళ్లు పూర్తి కాలేదు. దీన్ని బట్టి చూస్తే ఇళ్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది.



భారీ వర్షాల నేపథ్యంలో.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగాల్ తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్నిశాఖల అధికారులను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. వాగులు, వంకలు, కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఉద్యోగులందరూ వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఒంటిమిట్ట, కమలాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వర్షం.. రైతుకు కష్టం..

● ఉద్యాన పంటలపై తుఫాన్ దెబ్బ
● వరద నీటిలో అరటి, బొప్పాయి, మామిడి తోటలు
● ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు

6



రాయలసీమ అభివృద్ధిపై దృష్టిపెట్టండి

● అదానీ కార్యకలాపాలను రాష్ట్రంలో అడ్డుకోండి
● ముఖ్యమంత్రికి సూచించిన సాకే శైలజానాథ్



వేంపల్లెలో తులసిరెడ్డి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్


కడప కలెక్టరేట్/వేంపల్లె డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ వెనుకబడిన రాయలసీమ అభివృద్ధిని విస్మరించడం తగదని మాజీ పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కడపలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, వేంపల్లెలోని తులసిరెడ్డి కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టును కర్నూలుకు తరలించాలన్నారు. అయితే బెంచ్‌తో సరిపెట్టాలని అనుకోవడం సరికాదన్నారు. ముఖ్యంగా పులివెందుల మెడికల్ కళాశాలలో వెంటనే అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రాయలసీమ ప్రాంతానికి కేటాయించిన ఎంఎస్ఎంఈ కేంద్రాన్ని అమరావతికి తరలించడం ఆపాలని డిమాండ్ చేశారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాలన్ని అమరావతికి తరలించడం తగదన్నారు. రాయలసీమలో ఇప్పటివరకు ఏర్పాటు చేసిన సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించకూడదన్నారు. కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో అదానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలను అడ్డుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అదాని పాపాలను వదిలించుకోవాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని అన్నారు. బెల్టు షాపుల విషయంలో తాటతీస్తానని చంద్రబాబు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని, ప్రతి నియోజకవర్గంలో మూడు నాలుగు ఉన్నాయని, అవి టీడీపీ నాయకులే నిర్వహిస్తున్నారన్నారు. చంద్రబాబు పేరు ఎవరు చెప్పినా పట్టించుకోవడం లేదని, మద్యం, ఇసుక విషయంలో తేటతెల్లం అవుతోందన్నారు.ఈ కార్యక్రమంలో కడప అసెంబ్లీ కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, ధ్రువ కుమార్ రెడ్డి, గంగయ్య, అనిల్ కుమార్ రెడ్డి, నారత్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై కన్నెర్ర

● బద్వేలు వైసీపీ మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై కేసు
● మైదుకూరులో వైసీపీ నేత అరెస్టు
● వైసీపీ అక్రమార్కుల్లో వణుకు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో వైసీపీ నేతలు అడ్డగోలుగా వ్యవహరించారు. తమ మాటే శాసనం అన్నట్లుగా ఎగిరిపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల విషయంలో మరీ బరితెగించారు. వాగులు, వంకలు, రహదారులు, కాల్వలు కాదేది అనర్హం అన్నట్లుగా ఆక్రమించేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూకబ్జాదారులపై చర్యలు చేపట్టింది. ఇప్పుడిప్పుడే యాక్షన్ మొదలైంది. మైదుకూరు మండలానికి వైసీపీ నాయకుడు ముడమాల నారాయణరెడ్డి అలియాస్ ఎంఎన్ఆర్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

మైదుకూరు మండలం జీవీ సత్రం పరిధిలో కేసీ కెనాల్ 22వ కిలోమీటర్ వద్ద 290బి, 291లో 2.16ఎకరాల భూమిని కాల్వ కోసం ప్రభుత్వం తీసుకుంది. కాల్వ అవసరాల కోసం అందులో 76సెంట్లు తవ్వకాలు చేపట్టారు. మిగతా 1.35 ఎకరాల భూమి ఉండేది. అయితే వైసీపీ నాయకుడైన నారాయణరెడ్డి ఆ భూమిపై కన్నేశారు. దాన్ని ఆక్రమించేసి రెవెన్యూ నిబంధనలే మార్చేసి సెంటు రూ.3 లక్షల చొప్పున అమ్మేశారు. పలు దఫాలుగా 22మందికి అమ్మారు. ఫిర్యాదులు రావడంతో అధికారులు సర్వే నిర్వహించారు. తెలుగుగంగ కాల్వ కోసం సేకరించిన భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన అధికార యంత్రాంగం చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి వైసీపీ నాయకుడిని అరెస్టు చేశారు.



ప్రభుత్వ భూమిని సెంటు రూ.3లక్షల చొప్పున అమ్మేసిన వైసీపీ నేత ముడమాల నారాయణరెడ్డి

ఇక బద్వేలులో వైసీపీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి ఫ్రీహోల్డ్ పేరుతో రూ.కోట్లు విలువచేసే 5.99ఎకరాల భూమిని కొట్టేసి రిజిస్టర్ చేసుకున్నారు. బద్వేలు మండలంలోని చెన్నంపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 1754/2లో 1963లో దళితులు అయిన వెంకటయ్యకు అప్పట్లో పట్టా ఇచ్చారు. ప్రస్తుతం ఈ భూమి సెంటు రూ.15 లక్షల నుంచి రూ.20లక్షలు పలుకుతోంది. వెంకటయ్య కుమారుడు రత్నం 2018లో చనిపోయారు. వీరి స్థలంపై కన్నేసిన వైసీపీ నేతలు ఈ భూమిని ఫ్రీహోల్డ్ చేయించి డ్రైవర్ లక్ష్మీనారాయణ పేరిట రిజిస్టర్ చేయించారు. ఈ విషయం తెలియడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, ఆయన భార్య లక్షుమ్మ, డ్రైవర్ లక్ష్మీనారాయణ, సబ్‌రిజిస్ట్రార్‌లపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాలు జిల్లాల్లో కలకలం రేపుతున్నాయి. వైసీపీ నేతల కబ్జా నుంచి తమ భూములు కాపాడాలంటూ భారీఎత్తున ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో భూకబ్జాదారుల భరతం పట్టేందుకు సిద్ధమవుతోంది. దీంతో వైసీపీ భూకబ్జాదారుల్లో కలవరం మొదలైంది.

ఆర్టీపీపీలో ముగ్గురు అధికారుల బదిలీ

● వీరిపై అవినీతి ఆరోపణలు ● కొరడా ఝుళిపించిన ఏపీ జెన్కో

ఎర్రగుంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు అధికారులపై ఏపీ జెన్కో యాజమాన్యం కొరడా ఝుళిపించింది. కొద్ది కాలంగా ఆర్టీపీపీలో ఫ్లైయాష్ రవాణాలో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై జెన్కో విజిలెన్స్ ఎంక్వైరీ చేసి రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. బదిలీవేటు పడిన వారిలో ఆర్టీపీపీ స్టేజ్-1 ఓ అండ్ ఎం డీఈఈగా పనిచేస్తున్న నాపా శ్రీనివాసులును లోయర్ సీలేరు హైడల్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. డీఈ టెక్నికల్‌గా ఫ్లైయాష్ విభాగంలో పనిచేస్తున్న బి.నందానాయక్‌ను శ్రీశైలం రైట్ బ్యాంక్ హైడల్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. కోల్ ప్లాంటులో డీఈఈగా పనిచేస్తున్న బి.చంద్ర ఓబుళరెడ్డిని మాచ్‌ఖండ్ హైడల్ ప్రాజెక్టుకు బదిలీచేస్తూ జెన్కో ఎండీ చక్రధర్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు. వారిని వెంటనే రిలీవ్ చేయమని పేర్కొనడంతో ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్ గౌరీపతి వారిని రిలీవ్ చేశారు. ఇక్కడ వారిపై వచ్చిన అనేక అవినీతి ఆరోపణలపై తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. కాగా.. ఆ ముగ్గురు అధికారులను బదిలీచేయడంతో ఆర్టీపీపీలో ఉన్న మరికొన్ని అవినీతి తిమింగలాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. విచారణ జరిపితే ఆర్టీపీపీలో ఫెవికాల్ వీరులుగా ఉన్న వీరి బాగోతాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అక్రమాలపై మొదలైన విచారణ

● పలు సెక్షన్లలో ఫైళ్లు పరిశీలిస్తున్న అధికారులు

వివరాలు...7లో

వర్షం.. రైతుకు కష్టం...


నీటిలో మునిగిన చీనీ, నిమ్మ అంటుమొక్కలు

- ఉద్యాన పంటలపై తుఫాన్ దెబ్బ
- వరద నీటిలో అరటి, బొప్పాయి, మామిడి తోటలు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పంటలను నష్టపోతూనే ఉన్నారు. ప్రస్తుతం తుఫాన్ ఉద్యాన పంటలపై పంజా విసిరింది. దీంతో ఇటు మామిడి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. ఒకవైపు అరటి కాయలకు ధరలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మామిడికి డిసెంబరు మాసం నుంచే పూతలు ప్రారంభం కావాల్సి ఉండగా ఇంతవరకు రాలేదు. భూమిలో తేమ శాతం అధికం కావడంతో ఆలస్యంగా పూతలు వస్తాయని ఉద్యానశాఖ, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు కేంద్ర బిందువు. ఇక్కడ ఎక్కువగా అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు పండిస్తారు. మామిడి 20 వేల హెక్టార్లు, అరటి 15 వేల హెక్టార్లు, బొప్పాయి 15 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇక్కడ పండే ఉద్యాన పంటలను ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా అరటి, మామిడి, బొప్పాయి తోటల వైపు రైతులు వెళ్లడం లేదు. మామిడికి వర్షాలు రాకమునుపు వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేశారు.

కొట్టిన మందులు నీటి పాలయ్యాయని రైతులు వాపోతున్నారు. ముందస్తుగా వచ్చిన రుమాణి మామిడి కాయలకు మంగు ఏర్పడింది. కొనేవారు లేక రైతులు కిలో రూ.4 నుంచి రూ.5కు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి నర్సరీల్లో వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి నాట్లు వేసుకోవడానికి చెరువుల కింద నార్లు పోశారు. వర్షం తగ్గకపోవడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

నాటిన బొప్పాయి మొక్కలు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. గుండాలపల్లె, బయనపల్లె, తిమ్మిశెట్టిపల్లె, ఓబనపల్లె, అనంతరాజుపేట తదితర గ్రామాల్లో అంటుమొక్కలకు అసలే ధరలు లేవు. అవి కూడా దెబ్బతింటున్నాయని రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలకు సాగు చేస్తున్న పూల తోటలు, కూరగాయల తోటలు దెబ్బతింటున్నాయి.

ప్రతి ఏటా కురుస్తున్న భారీ వర్షాలు, పెనుగాలుల వల్ల ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి తోటలు వర్షం దెబ్బకు నానిపోయి కూలిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


బొప్పాయి తోటలో చేరిన వర్షం నీరు

మామిడి రైతులను ఆదుకోవాలి



మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ముందుగా వచ్చిన పూతలు మాడిపోయినాయి. డిసెంబరు మాసం నుంచి పూతలు రావాల్సి ఉంది. వర్షంతో పూతలు ఆలస్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. భూమిలో తేమ శాతం అత్యధికంగా ఉండడంతో మామిడిని దెబ్బతీస్తుంది. మామిడికి ఎక్కువ వేడి ఉండాలి. ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలి.

- మంకు సుబ్రహ్మణ్యం, రైతు, శెట్టిగుంట

వర్షాలతో రైతులు గుల్ల



రైతు, శెట్టిగుంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు గుల్లయ్యారు. చేతికి అందాల్సిన పంటలు రాలేదు. పెట్టిన పెట్టుబడులు కూడా అందడం లేదు. నష్టాలు వస్తున్నాయే తప్ప లాభాలు, పెట్టుబడి రావడం లేదు. అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలి.

- పి.దుర్గయ్య, రైతు, శెట్టిగుంట

ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి



రైతులకు బొప్పాయి విత్తనాలతో పాటు మామిడి మొక్కలు, అరటి మొక్కలు ఇవ్వాలి. ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలి. రైతుల ఇబ్బందులను పరిశీలించి తగిన న్యాయం చేయాలి. రైతు బాగుంటే దేశం బాగుంటుంది.

- చంద్ర, న్యాయవాది, శెట్టిగుంట

ఉద్యోగులందరూ ఒకే గదిలోనే...

- రికార్డులు పెట్టుకోవడానికీ గదులు లేవు
- పోస్టర్లు, కరపత్రాలన్నీ వరండాలోనే
- ఇదీ డీఎంహెచ్‌వో కార్యాలయం దుస్థితి


డీఎంహెచ్‌వో కార్యాలయ వరండాలోనే ఉంచిన పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాల ఏర్పాటులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొన్ని శాఖలకు తీరని అన్యాయం జరిగింది. హడావుడిగా జిల్లాలు ఏర్పాటు చేయడంలో వైద్య ఆరోగ్యశాఖకు అన్యాయం జరిగిందని వాదన ఉంది. ఇంత పెద్ద జిల్లాకు డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ప్రైవేటు భవనాల్లో కేటాయిస్తూ అందులోనూ వసతులు లేనటువంటి భవనాలు కేటాయించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని ఆ శాఖ సిబ్బంది వాపోతున్నారు.

దాదాపు సంవత్సరం తర్వాత నేషనల్ హైవేకి ఆనుకుని ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్‌లో కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దాదాపు పది మంది సెక్షన్లకు సంబంధించిన అధికారులు ఒకే గదిలో కూర్చుని ఉద్యోగం చేస్తున్నటువంటి పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రజల ఆరోగ్యాలు కాపాడే ఈ శాఖకు కనీస వసతులు కూడా కల్పించలేదు. ఆరోగ్య పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఇతర సామగ్రి అంతా కూడా కార్యాలయం బయట వరండాలోనే పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇంత పెద్ద కార్యాలయానికి ప్రహరీ కూడా లేకపోవడం వల్ల రకరకాల విషపురుగులు వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. జిల్లాకు కావాల్సిన మెటీరియల్ మొత్తం ఈ కార్యాలయానికి వస్తే అవి ఎక్కడ ఉంచాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తాగునీరు లేదు, మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేవని చెబుతున్నారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో కొండయ్యను వివరణ కోరగా మాకు రూము అయితే సరిపోవడం లేదు. సిబ్బంది కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

తుఫాన్‌తో పూల రైతులకు తీవ్ర నష్టం


వాల్మీకిపురంలో తోటలోనే వదిలేసిన చామంతి పూలు

వాల్మీకిపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుకాలం శ్రమించి సాగు చేసిన పంటలు కోత సమయాన నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న తుఫాన్ కారణంగా పూల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా దాదాపు 40 నుంచి 50 ఎకరాలలో రైతులు బంతి, చామంతి పూల తోటలు సాగు చేశారు. అయితే తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల నుంచి తుంపర్ల వర్షం కురుస్తుండటంతో పాటు ముసురు కమ్మేయడం వలన పూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో బంతి, చామంతి పూలను తోటల్లోనే రైతులు వదిలేశారు. అంతేకాకుండా వర్షంతో తోటల్లోనే పూలు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో బంతి పూలు కిలో రూ.50, చామంతి పూలు కిలో రూ.120 ఉన్నప్పటికీ తుఫాన్ కారణంగా తడిచిపోయిన పూల దిగుబడులను మార్కెట్లకు తరలించడం ద్వారా చామంతి కిలో రూ.40, బంతి పూలు కిలో రూ.15 పలుకుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

5న కలికిరిలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పాలిటెక్ ఫెస్ట్‌ను 5వ తేదీ గురువారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలోని మొత్తం 20 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 344 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్‌లో పాల్గొంటారని వివరించారు.

కలికిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని 9, 10 తరగతుల విద్యార్థులు కూడా ఈ ఫెస్ట్‌కు హాజరుకానున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ విద్యాభ్యాసం ప్రాధాన్యత గురించి అవగాహన పెంచుకోవడానికి ఈ ఫెస్ట్ మంచి వేదికగా ఉంటుందని పేర్కొన్నారు.

మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్ల తయారీ

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐదు రోజులుగా జరుగుతున్న విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణలో భాగంగా చివరి రోజు సోమవారం చిరుధాన్యాలతో 30 రకాల మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్ల తయారీని విజయవంతంగా పూర్తి చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. మల్టీ గ్రైన్ పౌడర్లతో పాటు బొప్పాయి క్యాండీస్ కూడా తయారు చేసినట్లు ఆమె వెల్లడించారు.

ఐదు రోజులుగా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గ్రామీణ మహిళలకు జరుగుతున్న శిక్షణలో భాగంగా సోమవారం జరిగిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొదటిసారిగా వివిధ రకాల చిరుధాన్యాలతో మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్లు తయారు చేయడంలో మెలకువలను నేర్పించినట్లు చెప్పారు. ఈ పౌడర్లతో వివిధ రకాల ఆరోగ్యవంతమైన పానీయాలను తయారు చేసుకోవచ్చునని చెప్పారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణలో భాగస్వామ్యంతో పాల్గొన్న కలికిరికి చెందిన మంజుల, అమ్మాజీ మాట్లాడుతూ కొర్ర, రాగి లాంటి చిరుధాన్యాలతో బిస్కెట్లు, మురుకులు తదితర పదార్థాల తయారీతో ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు. మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్లను జావ రూపంలోనూ, దోసె పిండిలో కలుపుకుని వినియోగించుకోవచ్చని సూచించారు. లడ్డూ, బజ్జీల తయారీలో కూడా ఈ పౌడర్లను కలిపి తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, శిక్షణ పొందిన మహిళలు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పీలేరులో జరిగిన మెడికల్ క్యాంపులో డీఐవో ఉషశ్రీ

పీలేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవి ప్రబలకుండా చూసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం పీలేరు పట్టణం సైనిక్‌నగర్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కాన్పులకు దగ్గరగా ఉన్న గర్భిణీలు, బాలింతలు, మంచానికి పరిమితమైన వృద్ధులు, నవజాత శిశువులు, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వెచ్చటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత నీరు, నవజాత శిశువులకు తల్లిపాలు, గర్భిణులు తాజా ఆకు కూరలు తీసుకోవాలన్నారు. వర్షాల ఉధృతి తగ్గే వరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే ప్రజలను చైతన్యవంతుల్ని చేయడమే కాకుండా వ్యాధులకు మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్‌రెడ్డి, హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్‌ఎంలు భార్గవి, ప్రమీల, సీహెచ్‌వో చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కౌట్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ : డీఈవో



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందని డీఈవో సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి పట్టణంలోని అర్చనా కళాశాలలో సోమవారం నుంచి స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఏడు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు అందరూ సేవాభావం, క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వారంలో ఒకరోజు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఒక పీరియడ్ కేటాయించామన్నారు. స్కౌటిజంతో చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుందన్నారు. అనంతరం అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు సమాజంలో బాధ్యతగా వ్యవహరించడానికి ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, జిల్లాలోని స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి

తంబళ్లపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు...తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెకు చెందిన రమణయ్య (49) ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ సాగించేవాడు. దురలవాట్లకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు మందలించడంతో మనస్థాపం చెంది గ్రామానికి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

జెండా దినోత్సవ స్టిక్కర్ల ఆవిష్కరణ


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల జెండా దినోత్సవం (డిసెంబరు 7) సందర్భంగా ప్రత్యేక స్టిక్కర్లను సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, కడప జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రజాక్‌ఖాన్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాయుధ దళాల త్యాగాలు, సేవలను గుర్తించేందుకు జెండా దినోత్సవం ఒక ప్రత్యేకమైన అవకాశం అని తెలిపారు. మాజీ సైనికులు, వీరనారులు, వారి కుటుంబాల సంక్షేమానికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బినామీ సంఘమిత్రలను తొలగించండి

- డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

గుర్రంకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలంలో బినామీ సంఘమిత్రలుగా పనిచేసే వారిని విధుల నుంచి తొలగించాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండల సమాఖ్య కార్యాలయంలో పనిచేసే సంఘమిత్రల్లో బినామీలున్నట్లు తెలిసిందన్నారు. ఈ బినామీలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు జిల్లా అధికారులకు పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అంతేకాకుండా గ్రూప్ సభ్యుల నుంచి రుణాలకు మామూళ్లు వసూలు చేస్తున్నారని కొందరు నాయకులు తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. మండలంలో బినామీ సంఘమిత్రలుగా పనిచేసే వారి వివరాలను తమకు పంపాలన్నారు.

అలాంటి వారిని తక్షణమే తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎం రజనీకుమారిని ఆదేశించారు. అనంతరం మండలంలో గ్రూప్‌ల వివరాలు, సభ్యులకు అందుతున్న రుణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘమిత్రలు విధులను దుర్వినియోగం చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని కృష్ణజింక మృతి



ములకలచెరువు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం ఓ కృష్ణజింక దారి తప్పి వచ్చి హల్‌చల్ చేసింది. జనావాసంలోకి వచ్చి దిక్కుతోచక హడలెత్తిపోయింది. చివరకు గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు...ములకలచెరువు బస్టాండు సర్కిల్ సమీపంలో ముంబాయి-చెన్నై జాతీయ రహదారిపైకి ఓ కృష్ణజింక వచ్చింది. రోడ్డు పక్కనున్న రైల్వే క్వార్టర్స్ నుంచి వచ్చిన జింక అడ్డుగా ఉన్న రైల్వే కమ్మీలు దాటుకుని రోడ్డుపైకి వచ్చింది. కొంతసేపు రోడ్డుపై అటు, ఇటు తిరిగింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌కు ఆనుకుని ఇటీవల వేసిన ఇనుప కమ్మీలు దాటుకోలేక రోడ్డుకు అడ్డుగా తిరిగింది. చివరకు దానిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అది కొద్దిసేపటికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గాయత్రి సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు మృతి చెందిన జింక కళేబరాన్ని కనుగొండ అటవీప్రాంతంలో ఖననం చేశారు.

గుండాలకోనకు రోడ్డు మంజూరు

- తీరిన భక్తుల కోరిక
- రూ.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం


గుండాలకోనకు వెళ్లే మార్గం

రైల్వేకోడూరు (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుండాలకోనకు రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న భక్తుల కల నెరవేరింది. చిట్వేలి మండలంలోని పెద్దూరు నుంచి ఎంద్రకాయ గుండాలకోన రోడ్డుకు మోక్షం లభించింది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. చాలా ఏళ్లుగా ముళ్లపొదలు, అధ్వాన్నమైన రోడ్డులో కోనకు వెళ్లాలంటే భక్తులు చాలా ఇబ్బందులు పడేవారు. ఇక్కడ మహిమాన్వితమైన ఎంద్రకాయ రూపంలో శివుడు దర్శనమిస్తాడు. కార్తీకమాస ఉత్సవాల్లో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ఇక్కడ పూజలు చేసి అక్కడ ఉన్న జలపాతంలో స్నానం ఆచరిస్తారు. మహాశివరాత్రి రోజు భక్తులు ఇక్కడికి పోటెత్తుతారు. గత ప్రభుత్వంలో రోడ్డును మంజూరు చేసినా నిధులు విడుదల చేయకపోవడంతో పాటు అటవీశాఖ అధికారుల అనుమతులు కూడా మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రోడ్డుకు నిధులతో పాటు అటవీశాఖ అనుమతులు కూడా ఇచ్చింది. దీంతో గుండాలకోన రోడ్డుకు ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయి త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఆధ్యాత్మికంగా విరాజిల్లుతున్న గుండాలకోనకు రోడ్డు వస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి చేతిలో కొడుకు హతం


హుస్సేన్‌బాష (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో సోమవారం హత్య జరిగింది. కన్న తండ్రే కొడుకును హత్య చేశాడు. మైదుకూరు సీఐ శివశంకర్ వివరాల మేరకు... హుస్సేన్‌బాషా (23) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను దూషించేవాడు. కొద్దిరోజుల కిందట డబ్బులు ఇవ్వలేదని హుస్సేన్‌బాషా తన తండ్రి మహబూబ్ షరీఫ్‌ను చంపుతానని బెదిరించాడు. ప్రతిరోజు లాగానే సోమవారం మద్యం సేవించి ఇంటి వద్దకు వచ్చి తండ్రితో గొడవ పడ్డాడు. భయానికి గురైన మహబూబ్‌షరీఫ్ రోకలిబడెతో కొడుకు తలపై బలంగా కొట్టాడు. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడిని చాగలమర్రి ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడని సీఐ తెలిపారు.

న్యాయం చేయండి: తన భర్త మృతికి కారణమైన మహబూబ్‌షరీఫ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మృతుని భార్య పోలీసులను వేడుకున్నారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు



ర్యాలీగా వెళ్తున్న అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు

కడప రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సేవలను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు గంటా సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. డీసీసీబీ సేవలపై సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కడప నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు డిసెంబరు 2 నుంచి 8వ తేది వరకు వారం రోజుల పాటు డీసీసీ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కడప నగరంలో విస్తృత ప్రచారం సాగించి డిపాజిట్ల సేకరణను తలపెట్టామన్నారు. డీసీసీ బ్యాంకు ఖాతాదారులకు మరింతగా సేవలను అందించేందుకు వడివడిగా ముందుకు సాగుతోందన్నారు. సహకార సంవృద్ధి డిపాజిట్ కాలపరిమితి కింద 666 రోజులకు సీనియర్ సిటిజన్లకు అన్ని బ్యాంకుల కంటే 8.35 శాతం అత్యధిక వడ్డీని, అలాగే సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సుధీర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎల్.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వీరబ్రహ్మం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థులకు గోల్డ్‌మెడల్


గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

లింగాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించారు. నవంబరు 29, 30, ఈనెల 1వ తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి గురుకుల కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తమ కళాశాల నుంచి చెస్‌కు ఒకరు, క్యారమ్స్‌కు ఇద్దరు, డిస్క్‌త్రోకు ఒకరు, రన్నింగ్‌కు ఒకరు ప్రాతినిథ్యం వహించారని ప్రిన్సిపల్ సత్యవతమ్మ తెలిపారు. సీనియర్ ఎంపీసీ ఎ.నిర్మల డిస్క్‌త్రోలో మొదటిస్థానం, 7వ తరగతి చదువుతున్న వి.భవ్య 200 మీటర్ల విభాగంలో మొదటిస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ ప్రసన్న వెంకటేష్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్ బహూకరించారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఇప్పట్ల గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ సత్యవతమ్మ, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందనల వర్షం కురిపించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు ఉపాధ్యాయులు సునీత, మాధవిలు ఎంతో శ్రమించారని ప్రిన్సిపల్ వెల్లడించారు.

విద్యార్థులకు సౌకర్యాల కల్పన

- వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అనుబంధ వసతిగృహాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరేలా నిర్ణయాలు తీసుకున్నారు. వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, వసతిగృహాల చీఫ్ వార్డెన్, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి వార్డెన్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అవసరాలు గుర్తించి ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఈసీ దృష్టికి తెచ్చారు. అనంతరం వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థినిలకు ప్రత్యేక మెస్ ఏర్పాటు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు వేడి నీరు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైనంత సిబ్బందిని ఏర్పాటు చేసి బాధ్యతలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే క్యాంపస్‌లో సీసీ కెమెరాలు పనిచేయని చోట వెంటనే ఏర్పాటు చేయాలని, ఇన్వర్టర్లు అవసరం ఉంటే ఏర్పాటు చేయాలన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో కాంస్యపతకం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ విద్యార్థి దేవరకొండ ప్రేమ్‌సాగర్‌కు కాంస్యపతకం దక్కింది. 51 కిలోల విభాగంలో ఈ పతకం సాధించాడు. ఈ విద్యార్థి కమలాపురం సీఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొని పతకం సాధించడం పట్ల వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, క్రీడల శాఖ విభాగం రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

నేషనల్ ఆర్ట్ గ్యాలరీకి ఏఎఫ్‌ఏయూ విద్యార్థి చిత్రం



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ పెయింటింగ్ విభాగం విద్యార్థి ఎస్.కార్తీక్‌కు అరుదైన అవకాశం దక్కింది. జాతీయ స్థాయిలో ప్రఖ్యాత జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచే టాప్ 45 చిత్రాల్లో కార్తీక్ గీసిన చిత్రానికి అవకాశం లభించింది. నవంబరు 24 నుంచి 30 వరకు క్యామల్ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హంపీలో నిర్వహించిన వర్క్‌షాపులో ఉత్తమమైన కళాఖండాలను ఎంపిక చేయగా అందులో కార్తీక్ గీసిన చిత్రం ఉంది. దీనిని ఈ నెల 14 నుంచి 20 వరకు ముంబైలో జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లో ఉంచనున్నారు. తమ విద్యార్థి చిత్రం నేషనల్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనకు ఎంపిక కావడంతో వీసీ విశ్వనాథకుమార్ అభినందనలు తెలిపారు.

కాసుల పంట.. కురిసెను రైతు ఇంట



- నిలకడగా టమోటా ధరలు
- ఆశించిన రీతిలో దిగుబడులు
- ఆనందోత్సాహాల్లో రైతులు

సంబేపల్లె, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో కరువు నేలపై కాసులు కురిపించే పంట ఏదైనా ఉందంటే అది టమోటా. అన్నమయ్య జిల్లాలో కొన్ని మండలాల్లో రైతులు టమోటా సాగు విపరీతంగా సాగు చేస్తారు. ఇందులో సంబేపల్లె, చిన్నమండెం, కలకడ, గుర్రంకొండ, అంగళ్లు, మదనపల్లె, కేవీపల్లె, మొలకలచెరువు, తంబళ్లపల్లి మండలాల్లో రైతులు విపరీతంగా టమోటా పంటసాగులు చేపడతారు. ఈ ఏడాది టమోటా రైతులకు ధరలు కలిసొచ్చాయి. ఐదారు నెలలుగా ధరలు నిలకడగా ఉండడంతో రైతులకు ఆశించిన రీతిలో కాసులు కురిపించాయి. కరువు నేలపై కాసుల పంట కురిసింది. రైతులు ఆశించిన రీతిలో మంచి దిగుబడులు రావడంతో మంచి ఆదాయాలను అర్జించారు.

టమోటా సాగులో నూతన ఒరవడి

ఒకప్పుడు టమోటా సాగుకు, ప్రస్తుత టమోటా సాగుకు ఎంతో వ్యత్యాసం ఉంది. పంట సాగుల్లో రైతులు నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగా అధిక దిగుబడినిచ్చే తీగజాతి రకాలు మార్కెట్‌లో రావడంతో వాటివైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణ టమోటా సాగు (కట్టెలు కట్టకుండా) నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తే, తీగజాతి రకం టమోటా 20 నుంచి 22 టన్నులు దిగుబడి రావడం విశేషం. రైతులు కట్టె పద్ధతిలో పురి కట్టి సాగు చేయడంతో వర్షాలకు టమోటా తోటలు దెబ్బతినకుండా కాయ నాణ్యతగా మంచి దిగుబడి తీస్తున్నారు.


సాగులో ఉన్న టమోటా తోట

సాగుకు పెరిగిన ఖర్చులు

తీగజాతి రకం టమోటా సాగుకు పెట్టుబడులు పెరిగిపోయాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం ఒక ఎకరానికి 80 నుంచి రూ.లక్ష పెట్టుబడి పెట్టేవారు. ప్రస్తుతం 1.50 లక్షల నుంచి 1.70 లక్షల వరకు పెట్టుబడి వస్తోంది. కూలీలు రేటు పెంచారు. టమోటా సామగ్రి ధరలు పెరిగాయి. ఇలా ప్రతి ఒక్కటి పెరగడంతో సాగు ఖర్చులు పెరిగిపోయాయి.

రైతులకు అనువుగా మార్కెట్‌లు

రైతులకు అనుకూలంగా టమోటా మార్కెట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో కలకడ, గుర్రంకొండ, మొలకలచెరువు, మదనపల్లి, అంగళ్లు ప్రాంతంలో టమోటా మార్కెట్లు ఉన్నాయి. దీంతో రైతులు పండించిన టమోటా మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చిత్తూరు ఆర్కాడు, చెన్నై, ఆళ్లగడ్డ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు తోటల వద్ద టమోటా కొనుగోలు చేస్తున్నారు.

మంచి ఆదాయం వచ్చింది

- నాగిరెడ్డి, రైతు, మాధంవాండ్లపల్లి

ఈ సారి టమోటా సాగులో మంచి ఆదాయం వచ్చింది. ఒకటిన్నర ఎకరం టమోటా సాగు చేశా. పెట్టుబడి సుమారు రూ.3.50 లక్షలు వచ్చింది. ఖర్చులు పోనూ దాదాపు రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ సారి టమోటా నష్టాల నుంచి గట్టెక్కింది.

ధర ఉంటే.. ఆదాయం లక్షల్లోనే

- వెంకటేశ్వరనాయుడు, దిగువరాజుగారిపల్లె, దేవపట్ల



టమోటా ధరలు ఉంటే ఆదాయం లక్షల్లోనే ఉంటుంది. ఒక ఏడాది ధరలు అమాంతంగా పడిపోవడం, పెట్టుబడులు రాక నష్టపోవడం జరుగుతుంది. ఈ ఏడాది నిలకడగా ధరలు ఉండడంతో మంచి ఆదాయం వచ్చింది. సంబేపల్లె వద్ద గుత్తకు రెండు ఎకరాల పొలం తీసుకొని సాగు చేశా. ఖర్చులు పోనూ 9 లక్షలు ఆదాయం వచ్చింది.

అక్రమాలపై మొదలైన విచారణ

- పలు సెక్షన్లలో ఫైళ్లు పరిశీలిస్తున్న అధికారులు


మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగిన అక్రమాలపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాధం సారధ్యంలో విచారణ మొదలైంది. సోమవారం ఉదయం ప్రొద్దుటూరుకు వచ్చిన ఆర్‌డీ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునతో కలిసి సమావేశమయ్యారు. అనంతరం విచారణ బృందంలోని ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్రలకు ఇంజనీరింగ్ సెక్షన్‌లోని ఫైళ్లు పరిశీలించమని ఆదేశించారు. దీంతో వారు ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులైన ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈలు దస్తగిరి, ప్రభాకర్‌దాస్, యశోద, ఏఈలు మణిగోపాల్‌రెడ్డి, సురేంద్ర, దిల్షాద్‌లతో కలిసి ఇంజినిరింగ్ సెక్షన్‌లో గత ఐదేళ్ల కాలంలో జరిగిన వర్కులకు సంబంధించిన ఫైళ్లను సంవత్సరాల వారిగా విభజించారు. అలాగే గ్రాంట్ వర్కులు, జనరల్‌ఫండ్ వర్కులు, ఇతర వర్కులను పరిశీలించారు. అలాగే బర్త్ అండ్ డెత్ విభాగంలోనూ పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి బుధవారం టౌన్‌ప్లానింగ్ ఆర్‌డీ రానున్నారని, ఆయన వచ్చాక బిల్డింగ్ అనుమతుల ఫైళ్లు, ఇతర ఫైళ్లు పరిశీలించనున్నట్లు ఆర్‌డీ తెలిపారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు సంబంధించి అన్ని ఫైళ్లు అందుబాటులో వుంచుకోవాలని ఆ సెక్షన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

కీలక ఫైళ్ల మాయంపై విచారణ

టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో కీలక ఫైళ్లు మాయంపై గతంలో ఇక్కడ పనిచేసి కడప కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లిన ఏసీపీ మునిరత్నం సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఎదుట హాజరై ఫైళ్లకు సంబంధించిన సమాచారంపై వివరణ ఇచ్చారు. అయితే ఆ ఫైళ్లకు సంబంధించిన పూర్తి స్థాయి సమాచారం అందించలేదని చెబుతున్నారు. అలాగే టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పాత ఫైళ్లకు సంబంధించి ఆన్‌లైన్ చేసిన హార్డ్‌డిస్క్ గురించి కూడా ఏసీపీ మునిరత్నం సరైన సమాధానం చెప్పనట్లు సమాచారం. దీనిపై కమిషనర్ మల్లికార్జునను వివరణ కోరగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

5న టేబుల్ టెన్నిస్ పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ఈ నెల 5న నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడా బోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2024 జూలై 7 నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. వైవీయూ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారులు పదోతరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు మిగతా అన్ని స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు.

వైవీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా


కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సోమవారం జరగాల్సిన సెమిస్టరు పరీక్షలు రద్దు చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తెలిపారు. వైస్‌ఛాన్సలరు క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు మృతి
- నలుగురికి గాయాలు


మృతి చెందిన సుబ్బయ్య, రోశయ్య

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వకట్ట వద్ద ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. ఆర్వీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాదు నుంచి పోరుమామిళ్లకు వస్తుండగా, బెస్తవారిపేట నుంచి బద్వేలుకు ప్యాసింజరు ఆటో వస్తోంది. కాల్వకట్ట వద్దకు రాగానే బస్సు ఆటోను ఢీకొనడంతో రామేశ్వరం గ్రామానికి చెందిన బి.రోశయ్య (65), అక్కల్‌రెడ్డిపల్లెకు చెందిన ఎం.సుబ్బయ్య (60) అనే వారు అక్కడికక్కడే మృతి చెందారు. బెస్తవారిపేటకు చెందిన కంచి వెంకటకుమార్, అలినగరం గ్రామానికి చెందిన కొమరం చెన్నమ్మ, గిద్దలూరుకు చెందిన బాలుడు అలియాస్ బాలచంద్రుడు, కొమరోలు మండలం పామూరుకు చెందిన షేక్ నాగుర్‌వల్లికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదకర సంఘటన తెలిసిన వెంటనే సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల విషయాలు ఆరా తీశారు. గాయపడ్డ వారిని 108 వాహనం ద్వారా పోరుమామిళ్లకు తరలించారు. గాయపడ్డ వారిలో చెన్నమ్మ, మరో వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ప్రైవేటు బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరికొందరికి గాయాలు


మృతిచెందిన మహిళ

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో అలీపాలకోవా సెంటర్ సమీపాన సోమవారం సాయంత్రం ఆటో డివైడర్‌కు తగిలి ఆటో వెనుక కూర్చొని ఉన్న దక్కా వెంకటభార్గవి (30) అనే మహిళ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మూడు కుటుంబాల వారు మొత్తం 15 మంది దాకా ఆటోలో గండి క్షేత్రానికి సాయంత్రం బయల్దేరారు. ప్యాసింజర్ ఆప్పే ఆటోలో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు రోడ్డుకు వెళుతుండగా పక్కనే వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఆటో డ్రైవర్ వెంకటయ్య డివైడర్‌కు ఢీకొన్నాడు. దీంతో వెనుక కూర్చొని ఉన్న మహిళ మృతి చెందగా అందులో ప్రయాణం చేస్తున్న పిల్లలు, పెద్దలు కలిపి 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. వెంకట్ అనే బాలుడికి మోకాలుకు గాయమైంది. ఘటన జరిగిన వెంటనే ఎస్‌ఐ కల్పన, రైటర్ సుబ్బారెడ్డి, వారి సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరు..


బాలక్రిష్ణ (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం మిట్టమాను సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని బాలకృష్ణ (25) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడు తన స్నేహితుడితో కలిసి బ్రహ్మంగారిమఠం నుంచి మైదుకూరుకు బైకులో వస్తుండగా మార్గమధ్యంలో ఈ సంఘటన జరిగింది. కాగా ఈ ప్రమాదంలో మృతుడి స్నేహితుడు శ్రీను గాయపడ్డాడు.

జేసీ వర్గీయులు వస్తారేమోనని.. మళ్లీ పోలీసుల మోహరింపు

కొండాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య ఆర్టీపీపీకి చెందిన ఫ్లైయాష్ రవాణాలో వివాదం ఇంకా సద్దుమణకపోవడంతో మళ్లీ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆర్టీపీపీ వద్ద జేసీ వర్గీయులకు సంబంధించిన వాహనాలకు ఎమ్మెల్యే ఆది వర్గీయులు బూడిదను లోడ్ చేయనివ్వకపోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాడిపత్రి నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి కానీ, అతని అనుచరులు కానీ ఇటువైపు వస్తారేమోనని, సోమవారం ఉదయం 6 నుంచే జిల్లా సరిహద్దుల్లో ఉన్న సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మోహరించారు. ఇద్దరు సీఐలు, ఎస్‌ఐలు, సుమారు 30 మంది పోలీసులు మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం తలెత్తే అవకాశం ఉండటంతో అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు చెక్‌పోస్ట్ వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. సిబ్బందికి తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. కాగా ఈ ప్రాంతంలో 144 సెక్షన్‌ను విధించినట్లు కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

‘మత్తు పదార్థాలకు బానిసవ్వద్దు’

సీకేదిన్నె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జయరాజ్‌లు తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, వాటి వినియోగం వలన కలిగే అనర్థాలు గురించి సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చకపోగా మంచి జీవితాన్ని కోల్పోతారన్నారు. మానసికంగా, శారీరకంగా అనేక రుగ్మతలకు గురవుతారని వివరించారు. ఇంజనీరింగ్ విద్య ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రవికుమార్, క్రిష్ణకుమార్, కళాశాల ఎండీ కందుల చంద్రఓబుళ్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్‌ప్రిన్సిపల్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు భూమి ఇచ్చే వరకు పోరాటం: సీపీఐ



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

పులివెందుల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సాగు భూమి ఇచ్చే వరకు పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. సోమవారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏపీ గిరిజన సమాఖ్య ఏపీజీఎస్, దళితుల పోరాట సమితి, దళిత, డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పులివెందుల రెవెన్యూ డివిజను పరిధిలోని 8 మండలాల్లోని సాగుభూమికి అర్హులైన వారంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ అధికారులు విలువైన ప్రభుత్వ, వంక, వాగు, రస్తా చెరువు, వక్ఫ్, ఇనాం భూములను కట్టబెట్టి కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారన్నారు. పేదలకు రెండు ఎకరాల సాగు భూమి మంజూరు చేయాలన్నా రు. పులివెందుల ప్రాంతంలో గతంలో పోరాడి సాధించుకున్న ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను ఉల్లంఘిస్తున్నారన్నారు. పాలక ప్రభుత్వాలకు బుద్ధి రావాలంటే పోరాటమే శరణ్యమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో అర్హులైన పేదల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఆ జాబితాలను అసైన్డ్ కమిటీకి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకరనాయక్, దళిత హ క్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునెయ్య, దళిత, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వర్‌రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేసీ బాదుల్లా, పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

లింగాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగాలలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు స్థానిక ఉన్నత పాఠశాలలో పరీక్షలు చేసి శస్త్ర చికిత్సలు అవసరైన వారిని గుర్తిస్తారన్నారు.

కలెక్టరేట్ 'డి' బ్లాక్‌కు దిక్కెవ్వరు?

అది ఆషామాషా ఆఫీసు కాదు... ఒకరిద్దరు అధికారులు ఉండే చోటు అసలే కాదు.. అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా అధికారుల కూడలి. అంతేకాదు.. జిల్లా కలెక్టర్ కూడా అక్కడే ఉంటారు.. అయితే కలెక్టరేట్‌లోని డిబ్లాక్‌లో పరిస్థితి ఇది.. ఇక్కడ పలు శాఖల కార్యాలయాలతో పాటు డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ పర్యాటక శాఖ తదితర ఆఫీసులు ఉన్నాయి. అయితే ఇక్కడ పారిశుధ్యం లోపించింది. ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు.. చెత్తకుప్పలే దర్శనమిస్తాయి. నాటేందుకు మొక్కలు తెచ్చి వాటిని అలాగే వదిలేశారు. - కడప ఎన్టీఆర్ సర్కిల్, (ఆంధ్రజ్యోతి)


కలెక్టరేట్ డి బ్లాక్‌లోని డ్వామా కార్యాలయం ఎదుట పిచ్చిమొక్కలు


డి బ్లాక్‌లో పక్కన పడేసిన పండ్ల మొక్కలు


చెత్తదిబ్బ


డి బ్లాక్‌లోని కార్యాలయాల నడుమ చెత్త

రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తుపాను కారణంగా రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ హయాంలో వర్షాలకు పంట నష్టం జరిగితే అదే సీజనులో పరిహారం చెల్లించేవారన్నారు. ఇప్పుడు తుఫానుకు వరి రైతు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, నాగేం ద్రారెడ్డి, షఫి, కిరణ్, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంధన సర్దుబాటు పేరుతో బాదుడే బాదుడు

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

ఇంధన సర్దుబాటు పేరుతో చంద్రబాబునాయుడు బాదుడే బాదుడు కార్యక్రమానికి తెర లేపారని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తెలిపారు. ప్రజలపై జనవరి నుంచి రూ.15485 కోట్ల విద్యుత్ భారం పడుతుందన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆరు నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. ఇప్పటికే దీపావళి కానుకగా రూ.672 కోట్లు భారం మోపారని మళ్లీ ఇప్పుడు యూనిట్‌పై 92 పైసల చొప్పున పెంచుతున్నారన్నారు. కూటమి నేతలు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేవరకు పోరాటం తప్పదన్నారు.

'నల్లబడ్డ ధాన్యాన్ని ప్రభుత్వం కొనాల్సిందే'

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లబడిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనాల్సిందేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మాదినేని రామసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చిన్నమాచుపల్లె, ఉప్పరపల్లె, రామనపల్లెలో వరి కోశారని, అందులో నల్లగింజలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీంతో వ్యాపారస్తులు రూ.3 వేలు తగ్గించి కొంటామని చెప్పడంతో రైతుకు తీరని నష్టమన్నారు. బీజేపీ నేతలు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు దాతల చేయూత


రఫీకి డబ్బు అందిస్తున్న దాతలు

పులివెందుల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నారి కాలేయ చికిత్సకు దాతలు చేయూతనిచ్చారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం పైడిపాలెం గ్రామానికి చెందిన మహ్మద్ రఫి నిరుపేద. రఫి దంపతులకు 10 నెల క్రితం ఓ బాలుడు పుట్టుకతోనే కాలేయ వ్యాధితో జన్మించాడు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహిస్తే బాలుడు బతికేఛాన్స్ ఉందని వైద్యులు చెప్పారు. నిరుపేదలైన రఫి కుటుంబం దిక్కుతోచనిస్థితిలో ఉండిపోయారు.

ఈ విషయం మీడియా ద్వారా గుర్తించిన పట్టణానికి చెందిన అమ్మ సేవా సమితి అధ్యక్షుడు పూల రమేశ్ బాబు స్పందించి తన మిత్రబృందం ద్వారా విరాళాలు రూ.30వేలు సేకరించారు. ఆ మొ త్తా న్ని రఫి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పూల రమేశ్‌బాబు, సాగర్ బాబు, ఆర్వీ న్యూట్రిషన్ హెల్త్ సెంటరు నిర్వాహకులు పెద్దవీరయ్య, దాతలు అల్లిపీరా, మల్లికార్జునరెడ్డి, నారాయణస్వామి, బాబా, జాకీర్ పాల్గొన్నారు.

ప్రజలకు భాగస్వామ్యం కల్పించేందుకే పీటీఎం

పులివెందుల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పనితీరును మెరుగుపరిచే క్రమంలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఉద్దేశమని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7న జరిగే మెగా పీటీఎం సమావేశంపై సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ చంద్రశేఖర్‌రావు, ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, డీఎల్‌పీఓ శ్రీరమాదేవితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనాల కోసం వారి తల్లిదండ్రుల నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారు, అలాగే తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారో తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని తదితరులు పాల్గొన్నారు.


మట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

యాచకులకు దుప్పట్లు పంపిణీ

కడప నాగరాజుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):చలి తీవ్రత పెరగడంతో యాచకులకు కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ గౌస్‌పీర్ సోమవారం దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా గౌస్‌పీర్ మాట్లాడుతూ కడప నగరంలో కురుస్తున్న వర్షానికి, చలికి ఇబ్బంది పడుతుండటంతో ఆర్టీసీ బస్టాండు కూడలి, పాతబస్టాండు, ఆర్డీఓ కార్యాలయం, రిమ్స్ ఆస్పత్రి, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లోని యాచకులకు దుప్పట్లు అందించామన్నారు.

6న దివ్యాంగులకు...

కడప మారుతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 6వ తేదీన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం చేపడుతున్నట్లు ఏపీ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు మాతయ్య తెలిపారు. కావున జిల్లాలోని దివ్యాంగులు తప్పక హాజరుకావాలని వారు కోరారు.

'ఏపీజీబీ తరలింపు ఆపాలి'


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రవిశంకర్‌రెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీజీబీ బ్యాంకు అమరావతికి తరలింపును ఆపాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఉన్న పరిశ్రమలను తరలించి ఈ ప్రాంతానికి అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా, రాష్ట్ర కమిటీ సభ్యులు చాంద్ బాషా, షాజహాన్ గౌస్, జిల్లా కమిటి సభ్యులు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నుంచి ఏపీ తరలించవద్దని ఆర్పీపీ జిల్లా కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం చింతకొమ్మదిన్నె మండల కార్యదర్శి ప్రసాద్‌తో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని సంస్థలు ఒక్కొక్కటిగా ఇతర ప్రాంతాలకు తలరిపోతే రాయలసీమ ప్రాంతం ఎడారిగా మిగిలపోతుందన్నారు.

సీకేదిన్నె: ఏపీజీబీ ఎంఎస్ఎంఈ సంస్థలను అమరావతికి తరలించవద్దని ఆర్పీపీ మండల కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం చింతకొమ్మదిన్నె తహసీల్దారుకు వినతి పత్రం అందించారు.

పింఛన్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న గోవర్ధనరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొత్తపింఛన్లకు, రేషన్ కార్డులకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పాలకులు పింఛన్లు, రేషన్‌కార్డుల విషయంలో లబ్ధిదారులకు అన్యాయం చేశారన్నారు. సీఎం చంద్రబాబు అర్హులైన వారందరికీ పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సచివాలయంలో ఈ నెల 2 నుంచి 28లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానంగా వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, డప్పు, చర్మకళాకారులు, కల్లుగీత కార్మికులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆధార్ జిరాక్స్‌తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆరు నెలల విద్యుత్ బిల్లులు, బియ్యం కార్డు జిరాక్స్ జత చేయాలని ఆయన వివరించారు.

గండి క్షేత్రంలో అరటి ఆకులో భోజనం

చక్రాయపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో అధికారయంత్రాంగం సోమవారం భక్తులకు అరటి ఆకులో భోజ నం ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నిత్యాన్నదాన పథకంలో భాగంగా ప్రతిరోజు 200 మంది, మంగళవారం 500, శనివారం 1000 మంది భక్తులు భోజనం చేస్తుంటారన్నారు. ఇదివరకు ప్లేట్లలో భోజనం పెట్టేవారమని, ఇప్పుడు అరటి ఆకులో వడిస్తున్నామన్నారు. అలాగే గండి క్షేత్రంలో ప్లాస్టిక్ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, ఆయాల వాచ్‌మెన్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం డీఆర్వోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలల వేతనాలు, స్కూలు ఆయాల వాచ్‌మెన్లకు ఆరు నెలల వేతనాలు అందజేయాలన్నారు. తొలగించిన కార్మికులు, ఆయాలు, వాచ్‌మెన్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం


కలెక్టర్‌ను సత్కరిస్తున్న పెద్దదర్గా కమిటీ సభ్యులు

కడపక లెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అమీన్ పీర్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యు లు ఘనంగా సత్కరించారు. దర్గా ఉర్సు ఉత్సవాలు ఘ నంగా నిర్వహించేందుకు సహాయ, సహకారాలు అందించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు

ఉపాధ్యాయులకు సెలవు నిరాకరించడం తగదు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):మెగా పేరెంట్స్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులకు సెలవు నిరాకరించడం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు.

రాష్ట్రస్థాయి టోర్నమెంటులో రిమ్స్ డాక్టర్ల విజయం


వైద్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేఎస్ఆర్ఎం కాలేజీ ఆవరణంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి డాక్టర్ల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటులో కడపకు చెందిన ఇరువురు డాక్టర్ల బృందం విజయం సాధించింది. ప్రొద్దుటూరు-కడప డాక్టర్ల మధ్య జరిగిన ఈ టోర్నమెంటులో ప్రథమ బహుమతిని (సివిల్ అసిస్టెంట్ సర్జన్ పెథాలజీ డిపార్ట్‌మెంటు) డాక్టర్ వెంకట మనోజ్, డాక్టర్ శ్యాంసుందర్ రావు సాధించారు. మూడో బహుమతిని డాక్టర్ ప్రతాప్‌రెడ్డి (ఈఎన్‌టీ అసిస్టెంటు ప్రొఫెసరు), డాక్టర్ జావేద్ (ఎమర్జన్సీ మెడిసిన్) కలిసి సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్‌ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

ముగిసిన సీపీఎం నగర మహాసభలు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నగర మహాసభలు నేటితో ముగిశాయి. 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. సోమవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో అనేక సమస్యలు పరిష్కారం కాకుండా దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం పెద్దఎత్తున పోరాటాలు చేయాలని నిర్ణయించిందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం వేశారని, ఇందుకోసం ఈ నెల 3న కడప నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తామన్నారు.

అంగరంగవైభవంగా అయ్యప్ప మండల పూజ


స్వామిని కొలువుదీర్చేందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్సీ


పూజలందుకుంటున్న అయ్యప్ప స్వామి

పులివెందుల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో సోమవారం అయ్యప్ప స్వామి 39వ మండల పూజ అంగరంగవైభవంగా జరిగింది. స్థానిక మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి భక్తిగీతాలు, భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అయ్యప్ప స్వామి సేవలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భిక్ష ఏర్పాటుచేశారు. అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

రాజ్యాంగంపట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశ పౌరులు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎం.అబ్దుసుబాన్ పేర్కొన్నారు. సోమవారం జమా అతే ఇస్లామి హింద్ కార్యాలయంలో భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి రాజ్యాంగం దోహదపడుతుందని తెలిపారు. మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం మాట్లాడుతూ అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజలకు అవకాశం కల్పించేలా రాజ్యాంగం రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంపీజే జిల్లా అధ్యక్షులు జాకీర్‌హుస్సేన్, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాష, నజీర్, అస్లాం, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయండి

ఎర్రగుంట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల సమావేశాన్ని ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఒకేసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించేందుకు ఒక్కొక్క సెంటర్‌కు ఒక స్పెషలాఫీసర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణయ్య, తహసీల్దార్ శోభన్‌బాబు పాల్గొన్నారు.

కడప ఉక్కు నిర్మాణం వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

బద్వేలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కడప ఉక్కు, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం వెంటనే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం బద్వేలు పట్టణ కమిటీ 7వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధిని అమరావతికి తరలిస్తున్నదని ఆయన ఆరోపించారు. రాయలసీమలోని తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా, వెలుగొండ, సర్వాయసాగర్ కింద పంట కాలువల పూర్తికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రాయలసీమ ప్రజల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

పాలవాగు కుంట ఆక్రమణ కాకుండా కాపాడండి


వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాలవాగుకుంట చెరువును ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని పశువులు, కొండకు మేత వెళ్లేందుకు సౌకర్యం కల్పించాలని సిద్దవరం పంచాయతీ పరిధిలోని అగ్రహారానికి చెందిన గ్రామస్థులు తహసీల్దారు చంద్రశేఖరెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం ఆ గ్రామస్థులు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టుకు ఆధారంగా ఉన్న చెరువుకట్టను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. అంతేకాక కొండ నుంచి చెరువుకు వాగు ద్వారా వచ్చే నీటిని కూడా రానివ్వకుండా సిమెంటు పైపులు వేసి మట్టి కప్పారన్నారు. ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు.

ఆసుపత్రి తనిఖీ


ఆసుపత్రిని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఉమాదేవి

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్లలోని 50 పడకల ఆసుపత్రిని డీఎంహెచ్‌వో ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశా రు. సోమవారం ఆమె పోరుమామిళ్లలోని ప్రభు త్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 7న చేపడుతున్న మెగా పేరెంట్స్ టీ చర్స్ సమావేశానికి ప్రతి ప్రభుత్వ పాఠశాలను సన్నద్ధతపరచుటకు అన్ని ప్రభుత్వ, ప్రాధమిక, ప్రాధమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సమావేశానికి విచ్చేసిన ఎంపీడీవో రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు.తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి,ఎంఈవో బాలఅంకిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్‌సిస్టం వితరణ

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలుకు సాధు సరస్వతి సౌండ్‌సిస్టం వితరణ చేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సౌండ్‌సిస్టం వితరణ చేశారు. అనంతరం సాధు గోపాలకృష్ణ, సాధు సరస్వతి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ విజయభాస్కర్, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ నాగార్జునరెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కార్యదర్శి సాయిప్రీతి, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పండించినా ఫలితం లేకపోయే..!

● వరుస తుఫాన్‌ల ధాటికి బెంబేలెత్తిపోతున్న వరి రైతులు ● అందినకాడికి దోచుకుంటున్న కోతమిషన్ దళారులు


బాలరాజుపల్లెవద్ద ధాన్యం తూకం వేస్తున్న దృశ్యం

కాశినాయన డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వరిరైతుల పరిస్థితి ముందు నొయ్యి వెనుక గొయ్యి అన్నచందాన ఉంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వచ్చిన వరుస తుఫాన్‌లు ధాన్యం రైతులకు శాపంగా మారాయి. దీంతో పంట పండించినా ఫలితం లేకపోయా అంటూ రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా దాదాపు 1566 ఎకరాల్లో వరిసాగుచేశారు. నారుమడి సాగు నుంచి పంట కోతవరకు ఎకరాకు దాదాపు రూ.30 నుంచి 35 వేల చొప్పున పెట్టుబడులు పెట్టారు. గతంతో పోల్చుకుంటే ఈసంవత్సరం వరికి తెగుళ్ళు తక్కువ మంచి నాణ్యతతో దిగుబడికూడా ఆశాజనకంగా వచ్చినట్లు సమాచారం.సగటున ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వచ్చిందని మరి కొందరికి 40 బస్తాల దిగుబడి వచ్చినట్లు పలువురు రైతులు తెలిపారు.కానీ అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు దిగుబడి వచ్చినా రేట్లు తగ్గడం,కోతరేట్లు రెట్టింపు కావడం ఇతర ఖర్చులు పెరగడంతో రైతుకు కలిగే ప్రయోజనం మాత్రం శూన్యమంటున్నారు

● వరుస తుఫాన్‌లతో బెంబేలు..: వరి నాటినప్పటి నుంచి రైతులను వర్షాలు వెంటాడాయి.అక్టోబరులో వచ్చిన తుఫాన్ వరి పొట్టదశలో,వెన్ను వదులుతూ,పాలెక్కే దశలో ఉన్న వరిని ఇబ్బంది పెడుతుందని భయపడ్డారు కానీ పెద్దగా ప్రభావం చూపలేదు. అనంతరం నవంబరులో వచ్చిన తుఫాన్‌తో గింజ తయారైన పంటచేలన్నీ దాదాపు నేలకు వాలిపోయాయి. అదృష్టవశాత్తు బోరు బావులకింద సాగుచేసినందున పొలంలో నీరు పెద్దగా నిలిచి ఉండక పోవడంతో నష్ట తీవ్రత తక్కువ అని తెలిసింది.. ప్రస్తుతం వచ్చిన ఫెంగల్ తుఫాన్ మాత్రం వరి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందనే చెప్పాలి.

● తగ్గిన ధాన్యం ధరలు..: పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధాన్యం రేట్లు గణనీయంగా పడిపోవడంతో రైతుల్లో సంతోషం లోపించింది.గత సంవత్సరం పంట కోసినవి కోసినట్లే పొలందగ్గర బస్తా రూ.1700 నుంచి 1800 వరకు కొనుగోలు చేశారు.కానీ ప్రస్తుతం 80కేజీల బస్తా రూ.1400 లకే అడుగుతున్నారు. అదికూడా వ్యాపారులను బతిమలాడాల్సినపరిస్థితి. ఆరబెట్టి ధర వచ్చినప్పుడు అమ్ముకుందామనుకుంటే భయపెడు తున్న తుఫాన్ గత్యంతరం లేక వచ్చినకాడికి గోవింద అంటూ రైతులు అమ్మేసుకుంటున్నారు.

అమాంతంగా పెంచిన వరికోత మిషన్ రేట్లు

పంటకాలం ముగియడంతో వరిచేలన్నీ దాదాపు ఒకేసారి కోతకు వచ్చాయి. స్థానికంగా కోత మిషన్‌లు తక్కువ దీనికి తోడు వారం పది రోజులుగా ఫెంగల్ తుఫాన్‌తో మబ్బులు అప్పుడప్పుడూ చిరుజల్లులు పడటం.వరి రైతులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. నోటికాడికి వచ్చిన పంట ఎక్కడ వర్షం పాలవుతుందోనని రైతులు కోత మిషన్‌లకోసం వెంపర్లాడటం మొదలుపెట్టారు.ఇదే అదనుగా భావించిన దళారులు వరి కోత రేట్లను అమాంతం గా పెంచారు. గత సంవత్సరం వరి కోతకు గంటకు రూ.2700 నుంచి రూ3000 ఉంటే ఈ సంవత్సరం గంటకు రూ.4000 నుంచి 4500 వరకు వసూళ్లు చేశారు. మామూలుగా ఎకరా వరి కోసేందుకు గంట సమయం పట్టేది, కానీ ఈ సంవత్సరం రెండున్నర గంటలు పడుతోందని రైతులు వాపోతున్నారు. అలాగే వరిగడ్డి కట్టలు కట్టేరేట్లు కూడా పెంచారు. దీంతో గత్యంతరం లేక అడిగినకాడికి ఇచ్చి రైతులు పంటలు కోయించుకుంటున్నారు. మరోవైపు వరిచేలు పడిపోవడంతో పంట కోయడానికి పట్టేసమయం రెట్టింపయ్యిందం టున్నారు. దీంతో వరి రైతులకు పెట్టుబడులు తడిసి మోపెడయ్యాయని ఆవేదవ్యక్తం చేస్తున్నారు.

● బాగా పండినా ఫలితం అంతంత మాత్రమే

నేను 5 ఎకరాలు వరిసాగు చేశాను.వర్షానికి పంట నేలకు వాలిపోయింది. అయినప్పటికీ 210 బస్తాల దిగుబడి వచ్చింది. గత సంవత్సరం అమ్మిన ధరలు ఉంటే కొద్దో గొప్పో మిగిలేది.ఈసంవత్సరం రేట్లు తగ్గిపోవడం, కోతఖర్చులు ఇతర పెట్టుబడులు గణనీయంగా పెరగడంతో పంట బాగాపండినా ఫలితం లేకుండాపోయింది

గుండయ్య, వరి రైతు, నర్సాపురం

తీరుమారని ట్రాఫిక్

● నరకయాతన అనుభవిస్తున్న వాహనదారులు ● ప్రతి వ్యాపారికీ రాజకీయం
● అడ్డంకులను తొలగించాలంటూ ప్రజలు విజ్ఞప్తి


జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో ట్రాఫిక్‌లో నిలిచిపోయిన ఇసుక, మట్టి టిప్పర్లు, బస్సులు

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లలో వాహనదారులు, బాటసారులకు నరకయాతన తప్పడం లేదు. ఉదయం నుంచి ఆ రోడ్లలో వాహనాల రద్దీ ఉంటుంది. ప్రధానంగా పాత బస్టాండులోని గాంధీ విగ్రహం వద్ద వ్యాపారులు రోడ్డును ఆక్రమించారు. ప్రొద్దుటూరులోని టౌన్ చర్చి వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించి కొందరు వ్యాపారాలు చేయడం, ద్విచక్ర వాహనాలు నిలిపి ఉండడంవలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో వాహనాలను తొలగించడం కానీ, అక్కడ పెట్టవద్దని చెప్పడం కానీ చేయలేదు. ట్రాఫిక్‌లో బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయని చెప్పాలన్నారాజకీయ ం అడ్డుపడుతోందని పలువురు వాపోతున్నారు. ప్రతి వ్యాపారికి, తోపుడుబండి యజమానులకు రాజకీయం ఉంది. వారు ప్రధాన రోడ్డుపై వాహనాలకు అడ్డంగా బండ్లు పెట్టి సిమెంటు దుకాణాల వారు, కడ్డీల అంగళ్లవారు ప్రతి ఒక్కరికీ పోలీసులు చెప్పాలన్నా రాజకీయ భయంతో ఎవరూ చర్యలు తీసుకోలేకపోతున్నారని బహిరంగ విమర్శలున్నాయి. కొందరు వ్యాపారాలు చేసుకుంటూ నాయకుల వెంట తిరుగుతూ ప్రదర్శనగా ఉంటే పోలీసులు చూసీ చూడనట్లు ఉన్నారని తెలుస్తోంది. అలాగే ముద్దనూరు రోడ్డులో ప్రతి అరగంటకు ఒకసారి వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోతాయి. వ్యాపారులు రోడ్డును ఆక్రమించడం, వినియోగదారులు వాహనాలు,ద్విచక్ర వాహనాలను రోడ్డుపై పెట్టడం, రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. పట్టణంలో అన్ని వీధుల్లో డ్రైనేజీ కాలువలు దాటి వచ్చిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలంటే పోలీసులకే వణుకు పుడుతోందని విమర్శలున్నాయి. అలాగే కూరగాయల మార్కెట్ వీధిలో ట్రాఫిక్ దారుణంగా ఉంటుంది. ఇప్పటికైనా ట్రాఫిక్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువల్లో ఏపుగా పెరిగిన జంబు

● తొలగించని సంబంధిత అధికారులు
● ఇబ్బందుల్లో రైతులు


ఉత్తర కాలువలో పెరిగిన జంబు

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఉత్తర, దక్షిణ కాలువల్లో జంబు ఏపుగా పెరిగింది. మైలవరం జలాశయం నుంచి ఉత్తర కాలువకు నీటిని విడుదల చేశారు. అయితే రైతాంగానికి చివరి ఆయకట్టు వరకు పంటల సాగుకోసం నీటిని అందించాల్సి ఉంది. అయితే ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారిందని పలువురు రైతులు వాపోతున్నారు. మండలంలోని మోరగుడి గ్రామం తాడిపత్రి రోడ్డు నుంచి ఇరిగేషన్ శాఖ సబ్‌డివిజన్‌లో 5.4 నుంచి 7.1 వరకు జంబు కాలువల్లో పెరిగింది. దీంతో మినుము, ఇతర పంటలు చేసేవారికి నీరు అందడంలేదని పలువురు వాపోతున్నారు. అలాగే దేవగుడి బ్రాంచ్ కెనాల్ జంబుతో నిండింది. దక్షిణ కాలువది ఇదే పరిస్థితి. ఆ రెండు కాలువల్లోకి జమ్మలమడుగు మున్సిపాలిటీలోని డ్రైనేజీ నీరు కలిసి కంపుకొడుతోందని రైతులు వాపోయారు. గతంలో మున్సిపల్ అధికారులకు సమస్య తెలిపినా స్పందించడంలేదని రైతులు తెలిపారు.

వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

బద్వేలు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కొరకు 4 శాతం నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో బద్వేలు ఏరియా అధ్యక్షుడు బాలరాజు, మురళి, నాగమణి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లావ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షుడు వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ధర్నా చేశారు. ఈ కారక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్యమయ్య, విజయమ్మ పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు.

వైభవంగా గుడి తిరుణాల

కలసపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కలసపాడులోని పరిపేతురు పరిపౌలు చర్చి 139వ వార్షికోత్సవం సందర్భంగా గుడి తిరుణాల నిర్వహించారు. నంద్యాల డయాసిస్ బిషప్ రెవరెండ్ జార్జి కోర్నిలియెస్ ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి బిషప్ ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ధనవంతుడు -లాజరు క్రైస్తవ నాటకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో క్రైస్తవ ఆరాధికులు పాల్గొన్నారు.

పసుపునకు దుంపకుళ్లు, బొబ్బడాల తెగులు


బొబ్బడాలు సోకిన పసుపు

చాపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేసిన పసుపు పంటకు దుంపకుళ్ల, బొబ్బడాల తెగులు సోకినట్లు రైతులు తెలిపారు. ఈ తెగులు సోకితే పసుపు కొమ్ములు పెరగకుండా చిన్నవిగా ఉంటాయన్నారు. దుంపకుళ్ల సోకితే కొమ్ములు పూర్తిగా దెబ్బతింటాయి. విశ్వనాథపురం, లక్ష్మీపేట, సీతారామపురం, బద్రిపల్లె, కేతవరం, చిన్నగురవలూరు గ్రామాల వద్ద సుమారు 500 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పసుపు కొమ్ములు ఊరే దశలో ఉంది. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో ఈ పైరు సాగు చేస్తారు. పసుపునకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గుతుందని రైతులు వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


నీటి తొట్టిని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

కాశినాయన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ,మండల వైద్యాధికారి పుష్ప పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సావి శెట్టిపల్లెను సందర్శించారు. ఈకార్యక్రమంలో పోరుమామిళ్ల సబ్‌యూనిట్ మలేరియా అధికారి నరసింహారెడ్డి, వైద్యఆరోగ్య పర్యవేక్షకులు శారద,నిర్మల, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాన్ని వేగవంతం చేయండి : భూపేశ్


కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి


ఎర్రగుంట్ల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాన్ని మరింత వేగవంతం చేయాలని టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో బిజీబిజీగా గడిపారు. కార్యకర్తల సమస్యలను వింటూ వాటికి వీలైనంత పరిష్కారం చేశారు. కడప రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఇటీవల వివాహం అయిన కోడూరు మాజీ సర్పంచ్ ఎస్.శివారెడ్డి కుమార్తె, అల్లుడిని ఆశీర్వదించారు. ఇటీవలే గుండె కు స్టంట్లు వేయించుకున్న ఎర్రగుంట్ల మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ సన్నపురెడ్డి సూర్యనారాయణరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్డీయే ఇన్‌చార్జి తప్పెట్ల మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు శివనారాయణరెడ్డి, మండల కో-ఆర్డినేటర్ ఎం.మోహన్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బయపురెడ్డి, బంగారురెడ్డి, కత్తి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న పంటల పరిశీలన


మరాటిపల్లెలో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కౌశిక

బి.కోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఐదురోజుల నుంచి కురుస్తున్న ఫెంగల్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను సోమవారం ఏవో కౌశిక పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. సోమవారం మరాటిపల్లె గ్రామంలో రైతులకు సూచనలు సలహాలు అందించారు. కంది పంటలో వర్షం నీరు నిల్వ ఉండకుండా వీలైనంత త్వరగా బయటికి పంపించాలని లీటరు నీటికి పది గ్రాములు 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన వారం తరువాత కాయ తొలిచే పురుగు నివారించడానికి క్లోరోపైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా నోవాల్యురాన్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మినుము, పెసర పంటలలో పొలంలో నిలిచి ఉన్న నీటిని బయటికి తీసేయాలని ఇనుప ధాతు లోపం గుర్తించినప్పుడు లీటరు నీటికి ఐదు గ్రాములు అన్నభేది,0.5 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. పైరు త్వరగా కోలుకోవడానికి లీటరు నీటికి 20 గ్రాముల యూరియా పిచికారీ చేయాలని తెలిపారు. అధిక తేమ వల్ల వేరుకుళ్ల తెగులు ఆశించే అవకాశం ఉన్నందున తాపరాశిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు ఎక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు. శనగపంటలో నీట మునిగినప్పుడు నీరు తీసివేసి ఎక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల బ్యాక్టీరియా ఎండు తెగులు, వాడుతెగులు రాకుండా పంటను కాపాడుకోవచ్చన్నారు. వరి కోతలు ప్రస్తుతానికి వాయిదా వేసుకోవడం మంచిదన్నారు.

రచయిత ప్రభాకర్‌కు జాతీయ పురస్కారం



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన రచయిత, పరిశోధకుడు డాక్టర్ ఎం.ప్రభాకర్ విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను పురస్కారానికి ఎంపికయ్యారు. రచనా రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 8వ తేదీ హైదరాబాదులోని టూరిజం ప్లాజాలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈవో సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు.